కథానిక

# చీకటి వెలుగులు

తిరునగర్

నిండు చంద్రుడు - పండువెన్నెల. అమృతసూతి అంశుమాలి తీక్ష్ణాంశువులచే కమలిపోయిన పూలకన్నెల శరీరాల్ని సేదదీరుస్తున్నాడు. తరువులుపొంగి పూలబాలలు వివశత్వంతో విడిచే నిట్టూర్పులు చల్లగాపిల్లగాలులతో కలిసి మానవులకు తమ కంకాళాలపైవుండే విహ్యభావాన్ని రూపుమాపి ఆహ్లాదం కలిగిస్తూ- ఆశావాదాన్ని రేపుతూ మమత్వాన్ని పురిగొల్పుతున్నాయి. వాశికాగ్రంలోకిపోయి నవ్యసౌగంధం పిచ్చెక్కిస్తోంది అవ్యక్త ఆనందంతో!

వెన్నెల ఏ పరమప్రయోజనంకోసం తానీ సేవనంతా మానవాళికి చేస్తోందో స్వార్థపరుడైన మానవుడికి ఎంత ఆలోచించినా అందకుండా అయోమయంగావుంది. మండుతున్న మస్తిష్కాలను ప్రచండాగ్నిపై శీతలాంబువువలె ఉపశమనం కలిగిస్తోంది. అసలు మానవుడు తన మెదడును ఎందుకు మండేట్లు చేసుకోవాలి? ప్రకృతి తననెందుకంత కనికరించాలి? ఏమో? శేషప్రశ్న! ప్రకృతినిగురించీ - వాటి పరమార్థాన్ని గురించీ పరీక్షిస్తూ కూర్చుంటే చివరికి ఇలాంటి శేషప్రశ్నలే శతాధికంగా మిగిలిపోతూ వుంటాయి.

ఏవేవో పాస్తిక ప్రణయగాథలు - గతించిన అనుభవాలబాధలు రేపుతున్నాయి. పాపంచుక్కలరేని పరమాశయం ప్రతివారికీ - తనకు చేతనైనంత సేవచేయాలని. కాని ప్రపంచంతీరు వేరు. అమృతాంశుడు అనుభవాలను కలిగించగలడేగాని-అనుభూతులకు తాను బాధ్యుడుకాడు. పిచ్చి చందమామకి తను అందిస్తున్న అనుభవాలు జీవులకు గతానుభూతుల్ని గుర్తుతెచ్చి - మానవుడు తాను వేటిని బలవంతాన దాచుకొని వేటి స్మరణకు భయపడతాడో వాటిని తన కిరణాలు బయల్పరచి బాధిస్తాయన్న విషయం తెలీదుపాపం. తెలిస్తే యీపాటిసేవగూడా బహుశా ఉపసంహరించుకుంటాడేమో!

సతి రెండో అంతస్తు వరండాదాటి ముందున్న పిట్టగోడ అంచుమీద కూర్చుంది. దీర్ఘమైన శిరోజాలు భూగోళానికి దూకుతున్నట్లు శిరస్సునుంచి క్రిందికి ఎన్నో చీలికలై గోడ ఉపరిభాగాన్ని అంటుతున్నాయి. చల్లని పిల్లగాలికి మెల్లమెల్లగా ఆడుకొంటున్నాయి కుంతలాలు సౌగంధ వాయువులతో చేతులు కలిపి-తలంటు పోసుకున్న తలతేలికగా నలుమూలలా వ్యాపించిన నక్షత్రాచు పిల్లలు మూలితో భూమిని పరామర్శ చేస్తున్నట్లు భూమ్మీద అటూ ఇటూ సంచరిస్తున్నాయి. సతి పూర్ణచంద్రుణ్ణి కన్నార్పకుండా చూస్తోంది. స్తంభాలకి అంటుకుపోయి సౌధోపరి భాగానికి ప్రాకిపోయిన సన్నజాజిపూలలతిక మాలతితో పెనవేసుకొని అప్పటివరకు పూయకుండావుంది మొదలకుండా! ఒక్కతెనశక్తినంతటినీ విజృంభింపజేసింది. మాలతీజాజుల మధురవాసనలలో ప్రదేశమంతా మత్తుగావుంది. సతిసుదీర్ఘకేశాలు వెన్నుభాగాన్ని కప్పివేస్తూ ఒకవేపుకు కేవలం శోకదేవత మూర్తీభవించి కూర్చున్నట్లుగా వుంది. స్తంభానికి ఆనుకొని చేరగిలబడిపిచ్చిగా చంద్రుడివంక చూస్తోంది- అది చాలు అనుభూతికి. తను చందమామను ప్రశ్నిస్తోంది. అందరికీ మామ ఆమె ప్రశ్నలకు సమాధానం చెపుతున్నాడు. ఆ భాష వేరు. అది అర్థంకావడానికి సహృదయం కావాలి! పండిపోయిన పండితుడు మానవత్వాన్ని ఓ చోట పెట్టి దానికి దూరంగా వచ్చి కొంచెంసేపు దేవత్వంలో నిలబడాలి!

ప్రేమ-కామానికి కట్టుబడిపోయిన మానవజాతిని పునీతంచేసి మానవజన్మకు సార్థకం చేకూరుస్తుంది. భగవంతుడు తాను సృష్టించిన జీవగణంలో ఈ మాత్రమైనా సుగుణం లేకపోతే తాను సృష్టికే అన్యాయంచేసినట్లవుతుం దనుకున్నాడు గాబోలు పాపం! అందుకే అంధకారమైన కామపరీవృత జగత్తులో ప్రేమ అనే దివ్యజ్యోతిని ఒకటి పెట్టి దాన్నందుకొని మానవ

జన్మను సార్థకపరచుకోమని-తననుంచి తప్పు అని చెప్పబడే భారాన్ని తొలగించుకున్నాడు!

ఆ నిశ్చల నిస్తబ్ధ వాతావరణంలోకి అప్పుడే తలుపులు తోసుకొని ప్రవేశించాడు జయదేవ్! ఎదురుగా శిలా ప్రతిమలా-బహు ప్రజ్ఞాశాలియైన శిల్పి చెక్కిన రాతి చెక్కడంలా ప్రతిష్ఠింబడి వుందామె! జయదేవుని హృదయంలో ఈ సన్నివేశం ఏ గతజీవిత కథనాన్ని గుర్తుతెచ్చిందో తనవంకనే చూస్తున్న చందమామకు మాత్రమే తెలియాలి! గుండ్రటి నల్ల చెక్కబల్ల హాలు మధ్యగా వుంది-పైన చంద్రకాంతి ప్రతిఫలించి విచిత్రంగా మెరుస్తోంది. జయదేవ్ పాద ధ్వని కొంచెంగూడా ఆ వాతావరణాన్ని విచలితం చేయకపోలేదు. కానినిష్ఠనుభంగకర చేంత ఉధృతం మాత్రం కాలేదు. బాహ్యపరిసరాల ప్రభావాల్నించి తపోశక్తివల్ల పండిపోయిన దేహం శీతోష్ణస్థితుల కెలా చాంచల్యం పొందకుండా స్థిరత్వంపొంది దేహ ధర్మాన్ని అతిక్రమిస్తుందో-సతి మనసూ సామాన్య పరిధులు దాటి బాహ్యవిషయ పరిజ్ఞానం కోల్పోయింది.

తన రాకను అంటుకత్తేకు అవగాహన అయేట్లు చిన్నగా ధ్వనిచేశాడు శబ్దభేరితో! కాని సతీ ఈషన్మాత్రమైనా చలించడం గమనించక హతాశుడైనా డతడు - మెల్లగా ఓ సోఫాలో కూర్చొబడ్డాడు. అది ఓ చిత్రమైన ఘడియ! ఆభావం తనకు తెలీదు. ఇతరులకు అర్థం కాదు. అవ్యక్తంగానో, అభేద్యంగానో, అంతుతెలియని హృదయంలాగానో వుంటుంది. సతినిగురించి తనేమని ఆలోచించాలి? ఆమె అలా ఎందుకాలోచిస్తోందో తనకు తెలుసు. కాని తెలీదు-సందిగ్ధం ఏమిటో- మానవుడి మృత్యు ఘడియల్లా! తనకు తెలుసు-సతి బాధపడుతోంది. వ్యథాభరితమైన హృదయంతో ఏడుస్తోంది. ఆక్రోశిస్తోంది ఎవ్వరికీ తెలియకుండా! నిశ్చలంగా కాలుతున్న కట్టెలా కదలకుండా - లోపల్లోపల కుమిలిపోతోంది! గతించిన జీవిత క్రమాన్ని గుర్తుతెచ్చుకొని తను అకృతాత్మురాలైనందుకు ఆమెనామె నిందించుకొంటోంది.

* * *

ఒకనాడు ఓ దుస్స్వప్నంలో పరిస్థితులు అస్తవ్యస్తాలై, అమానుషం ప్రబలి ఆమె, తనూ దూరమైపోయారు. ఉస్మానియా యూనివర్శిటీలో సతి బి. ఏ., తను ఎం. ఏ., చదువుతున్న రోజులవి. తండ్రి సతిని తన కుమారునకిచ్చి చేయవలసిందిగా-ఆమె తండ్రీ- తన స్నేహితుడూ అయిన రఘునాథరావుతో చెప్పి ఒప్పించాడు. పసుపు కుంకుమగూడా పెట్టాడు. పరీక్షలు అయిన తరువాత పెళ్లిచేద్దామనుకున్నారు ఇద్దరు మిత్రులూ నిర్ణయానికొచ్చి యువకత్వంలో ప్రేమకు సరైన విలువలేదని తెలిసి అప్పటివరకూ తన మనోభావాలను ఏ నిర్దిష్టవ్యక్తికైకీ పాకనివ్వకుండా దాచుకున్న జయదేవ్ సతిని ఆరాటించి ప్రేమించడం నేర్చుకున్నాడు. అసలు సతే అతనికి ప్రేమను నేర్పింది. ఆమె లేకపోతే తన నిరాశావాద జీవితంలో ఉల్లాసం, ఉత్సాహం, ధైర్యం, స్థైర్యం ఇవేవీ తలవూపివుండేదికాదేమో! ఆమె తన శక్తి కౌశలాన్ని ప్రయోగించి తనను ప్రేమించుకొనేటట్లు చేసుకుంది. తను ఆమెను పిచ్చిగా ప్రేమించాడు. కలియుగం దాటి ద్వాపరయుగంలో రాధాకృష్ణులులా విహరించారు. కైలాసశిఖరం చేరి కైలాసవాసులు కంఠేకలుడు కనకదుర్గల దాంపత్యాల్ని మించేవారు.

కాని అదంతా ఓసుఖస్వప్నంలా గడిచిపోయి శేషాన్నిమాత్రం హృదయంమీద ప్రగాఢంగా ముద్రవేసిపోయింది మానవులు మతం పేరిట చేసే దురాచారాలకు అంతులేకుండాపోయింది. అసలు మనష్యజన్మకే అర్థంలేకుండాపోయింది. ప్రతి నిమిషం దోపిడీలు, మానభంగాలు, మానవుడిలో మతమనే తుఫానులేచి పవిత్రాత్మలోవుండే మానుషాన్ని తరిమివేసి జంతుత్వాన్ని ఆక్రమించుకొనేట్లు చేసింది. శరీరంలో రక్తమంతా పట్టి కాలకూట విషంగా మారిపోయింది. రక్తం ప్రవహించే నాళాల్లో కేవలం విషమే ప్రసరించింది. వ్యక్తుల్ని పిచ్చివాళ్ళను చేసింది. జీవితంలో ఏది ముఖ్యమో అనే విచక్షణా పరిజ్ఞానం పారిపోయిందెక్కడకో! మిగిలింది విషం పుట్టి-

నవనాగరికులమనీ, పరమాణుయుగేయులమనీ చెప్పుకునే ఇరవైయ్యోశతాబ్దికులు సహితం మానసిక ఆవేశాలకు లొంగిపోయి మానవత్వాన్ని అతి

క్రమిస్తున్న పుష-అంతకంటే అతిఘోరం ఇంకే ముంటుంది? ప్రజలు ఎక్కడివాళ్ళక్కడ వలసలు పోతున్నారు. ఇంట్లోనుంచి బయటికి రావటానికి కూడా మనిషికి హక్కులేకుండాపోయింది - ఒక ప్రక్క ఆ హక్కు క్షుద్రజీవులయిన జంతువులు అనుభవిస్తూ వుండగా! ఓరోజు ఎలాగో తెగించి సతిని కలుసుకోడానికి జయదేవ్ బయలుదేరాడు. అప్పటికే ఇల్లు ఖాళీచేయబడి వుంది గృహాంగణంలో చాలాచోట్ల నరహత్య చేయబడ్డట్లు రక్తపు చారికలు కనిపించాయి. ఇంటి తలుపులన్నీ బార్లగా తీసివున్నాయి. దోపిడీ చేయగా విడిచి పెట్టబడ్డట్లు కనిపిస్తోంది.

"సతీ...ఎక్కడ?" పిచ్చిగా అరిచాడతను. ప్రతి ధ్వనించిందతని బాధ పరత్యక్త హృదయంలో.

ఇంటికి చేరేసరికి తనకోసం తండ్రి ప్రాణాలు అరచేతిలో పెట్టుకూర్చున్నాడు వెయ్యికళ్లతో నిరీక్షిస్తూ! "వచ్చావా నాయనా? సుఖంగా తిరిగి వచ్చావా?" కౌగలించుకొని తడిమాడు వళ్ళంతా!

"మనం ఇక్కడ వుండొద్దు బాబూ - వెళ్ళి పోదాం పద" తొందర పెట్టాడు తనని.

"తనకు తనదిక్కడేదో వుంది. కదల్ను" అని. భీష్మించుకూర్చోవడానికి ఏమీలేదు. శూన్య హృదయంతో తనూ తండ్రి వెనక నడిచాడు. ఎక్కడికో? మానవుడిలో మతం పూర్తిగా మాసి పోయిన చోటికి. కాని అది సాధ్యమా? సంఘ మున్న ప్రతిచోటా సంఘర్షణ తప్పదు మరి. ఎక్కడికో? ఎక్కడికో!

సంపాదించికూడబెట్టిన డబ్బు కొడుకుచేతిలో పెట్టి ఇహలోక బాంధవ్యం చెల్లించుకున్నాడు ముసిలి తండ్రి. మనిషి తాత్కాలికంగా చచ్చి పోయేటంత బాధపడతాడు తప్ప అటువంటి క్షణాలు లక్షవచ్చినా చివరికి మిగిలేవుంటాడు. ఇన్నికష్టాల్లోనూ తను చచ్చిపోకుండా వుండడం ఆశ్చర్యం కలిగించింది జయదేవుకి. మానవజన్మ మీద మమతా? దేహంమీద మోహం చావకా? జీవచ్ఛవంలా జీవిస్తున్నాను అనుకున్నాడు జయదేవ్. బ్రతుకు భారంగావుంది. జీవితం ఓ క్షణమైనా ఏకాంతాన్నిగాని, శాంతినిగాని సహించలేకుండావుంది. ఎప్పుడూ ఏదో చేస్తూ వుండాలి మనస్సును ఇంకోచోటికి పోనివ్వకుండా! లేకపోతే తనకు నరకబాధలా వుంది జీవితం!

"చేతులో డబ్బుతో వ్యాపారంచేస్తే!" అనుకున్నాడు, తనకు తండ్రిచ్చిపోయిన డబ్బు ఏమీ తక్కువగాదు. కంపెనీ స్టార్టు చేశాడు. నష్టం వస్తేరానీ–ఆత్మశాంతి నష్టమంత ఖరీదుచెయ్యదూ? కాని కంపెనీ దినదినాభివృద్ధి కాంచుతోంది. నమ్మకస్థుడైన మానేజరు తనను దేవుడిలా కొలుస్తున్నాడు. తన ప్రమేయం లేకుండానే కంపెనీ వ్యవహారాలు అతనే చూచుకొంటున్నాడు. తను మనస్సుకి భయపడి దానికి క్షణం తీరికలేకుండా వినోదాల్లో కాలం గడుపుతున్నాడు.

"మానేజరుగారు ఒప్పుకోవడంలేదు. ఓ నెల రోజులు సెలవు ఇప్పించాలి" లేడీ టైపిస్టు. డైరెక్టుగావచ్చి కంపెనీ ప్రొప్రైటర్ని అడిగింది

తలెత్తిచూచి "ఓ! అలాగే..." అని మాత్రం అనగలిగాడు తెరిచిననోరు తెరిచినట్లే వుండి పోయింది. క్షణంసేపు కొయ్యబారి పోయాడు. ఆమె ... సతి! ఆమె జయదేవ్ కళ్ళల్లోకి చూచింది. ఆ చూపులు లోపలకుపోయి కోల్పోయిన వస్తువుని వెతుక్కుంటున్నాయి. ఒక్క సెకను ఒక్క రోజులా వుంది. ప్రతి సెకనూ అమూల్యంగా వుంది. ఏమో! ఈదివ్యసందర్శనం పాపిష్టి కళ్ళనించి దాటిపోతుందేమో ఎవరి తెలుసు? ఎవ్వరికీ బాహ్యస్మృతి లేదు. పరిసరాల్ని విస్మరించి పదేపదే గతాన్ని సింహావలోకనం చేసుకుంటున్నాయి చూపులు. కాలేజీ చదువు-ప్రేమలతల పెనవేత...ఇంతకాలం జయదేవ్ని గుర్తించక ...

హఠాత్తుగా సతికి స్మృతివచ్చింది. సినిమా రీలు టక్కున తెగిపోయింది. లోలోపల "హా! భగవంతుడా, ఎలా విడదీసి చివరి కిలాటిచోట సంఘటిత పరచావా ప్రభూ!" అనుకుంది సతి వెనుదిరిగి గబగబా వెళ్ళిపోతూ. జయదేవ్ ప్రపంచంలోకి వచ్చేసరికి అంతా శూన్యమే మిగిలింది. గడచిపోయింది దివ్యస్వప్నం! తనకు మెలకువ వచ్చేసింది. ఎందుకు రావాలి? సుషుప్త సుఖస్వప్నంలో ఉన్న సుఖం జాగ్రదావస్థలో ఎక్కడ వుంది? ఇది కేవలం సుఖస్వప్నమేనా?

"సతీ" పెద్దగా అరిచాడు.

ప్రక్క గదిలో వున్న లేడీ టైపిస్టు పరిగెత్తుకొచ్చింది.

"సతి అనే అమ్మాయి మన కంపెనీలో పని చేస్తోందా?"

"సతి కాదండి సత్యవతి అనే అమ్మాయి మన కంపెనీలో టైపిస్టు."

ఆ లేడీ టైపిస్టు సహాయంతో కారు సతి ఇంటి ముందు ఆగింది. తలుపులు దగ్గరికి వేసివున్నాయి. లోపలికి వెళ్ళేసరికి సతి పక్కమీద పండుకొని వెక్కి వెక్కి ఏడుస్తోంది. జయదేవ్‌ని గమనించింది. ముఖం దిండులో దాచుకుంది. తనేమీ మాట్లాడలేకుండా వున్నాడు. ఆమెనెలా ఓదార్చాలో తనకు తెలీదు. దుఃఖం భారంతా గొంతు పూడి పోయింది.

ఎన్ని తరాలనుంచో దాచి అణుచుకున్న శోకాన్నంతా ఆనకట్టు కట్టినా ఆగకుండా ప్రవహిస్తోంది. ఎంతకాలం గతించిందో - సృష్టి నడుస్తోందో ఆగిపోయిందో అంతా వారికి అనవసర విషయాలు. కన్నీటి కల్లోలినిలో కట్టలు తెగి కొట్టుకుపోతున్నా రెక్కడికో - పాపప్రక్షాళన చేసే పరమశివుడి సన్నిధికేమో!

సుడిగుండంలోంచి స్వరంవచ్చినట్లు "సతీ" అన్నాడు. ఆ పిలుపు తనుచేసిన పాపాలన్నిటినీ పైకి తీయించి వాటిచేత తనదేహాన్ని దావానలంలో వేయించుతూ వున్నట్లుగా వుంది సతికి.

"నన్నలా పిలవకండి" పూడిపోయినగొంతులో నుంచి పేలవంగా వచ్చింది మాట.

అతను మళ్లా "సతీ" అన్నాడు. ఈసారి స్వరం 'నాకీపాటి అదృష్టాన్నన్నా లేకుండా చెయ్యకు' అన్నట్లుగా వుంది. ఒక్కొక్క అడుగు దగ్గరపడుతోంది. "నన్ను ముట్టుకోకండి - నేను పాపంచేశాను... పతితనై పోయాను. నేను మీకే విధంగానూ స్వీకారయోగ్యనుగాను - నామాట వినండి"

అడుగులింకా దగ్గరపడుతూనే వున్నాయి.

"నే చెప్పేది వినండి. నాన్నను హంతకులు హత్యచేస్తే అమ్మా నేనూ వచ్చేశాం. ఆమె ఆకలికి ఆహుతి అయిపోయింది. గతిలేక మానాన్ని అమ్ముకోవలసివచ్చింది. అయ్యో-నన్ను ముట్టుకోకండి!"

"సతీ... నా దేవతా" గాఢ పరిష్వంగం చేశాడు. ఆ గాఢ పరిష్వంగంలో జగం - జనం- ఆకాశం-భూదేవి సర్వప్రకృతీ కరిగిపోయి కలిసిపోయి నీలం-శ్వేతం-అరుణం-రక్తవర్ణమూ అన్నీ అన్నీ కలిసి ఏకమై బ్రహ్మాండభాండమంతానిండి పోయి వుంది. అది కేవలం అనంతావధి మాత్రమే! దాంట్లో సంకుచితత్వానికీ- ద్వేషానికీ తావులేదు. అంతా ప్రేమమయమైంది. దాని రంగు సామాన్య ఇంద్రియాలకు అతీతమైనది.

"ఓ దేవతా-నీకోసమే వెతుకుతూ యింత వరకూ జీవించివున్నాను. నాకు నీ ప్రత్యక్షం చాలు- గతంలో నీవేమిచేసినా నాకు ప్రమేయం లేదు. నీ ప్రత్యక్షంకంటే నేనింకేమీ నీ దగ్గర నుంచి అర్థించను."

* * *

దీర్ఘంగా నిట్టూర్చాడు జయదేవ్! తను ఏమేమో చెప్పాలనుకుంటాడు సతికి- కాని చెప్పలేడు. ఆమెను ఓదార్చడం అతనికి చేతకాదు. మెల్లగా లేచి వెళ్ళాడు. సతి ఇంకా అతన్ని గమనించనేలేదు. పూర్వస్మృతుల లోతుల్లో ఎక్కడో వుంది. అలాగే రేరాజువంక చూస్తూ! చెంపవెంట కారే కన్నీటిచుక్కల్లో చందమామ ముఖం చూచుకొంటున్నాడు.

జయదేవ్ ఆమె భుజంమీద చేయివేసి "సతీ" అన్నాడు అస్పష్టంగా!

"ఆఁ" నిద్రలోంచి ఉలికిపడ్డట్లు లేచి నిలబడింది. క్షపాకరుని కాంతిలో చెక్కిళ్ళమీద కన్నీటి చారికలు అస్పష్టంగా కన్పిస్తూనే వున్నాయి.

"ఎందుకు నీకింత బాధ?" ఆ స్వరాన్ని విని సతి కంపించిపోయింది.

"లేదు. నే నేమీ బాధపడటంలేదు" అంది తల వంచుకొని. తెల్లటి చీరమీద నల్లటి వెంట్రుకలు చిరుగాలికి అటూ ఇటూ ఆడుకొంటున్నాయి.

"జీవితంలో ప్రేమ, ఆత్మీయత ముఖ్యం. శరీర సంబంధం దాన్ని వదపోస్తే చివరికి మిగిలే అల్పపదార్థం; ప్రేమహృదయానికి సంబంధించింది. ఇన్నీ తెలిసినన్నందుకు నువ్విలా బాధిస్తున్నావో నాకు తెలియకుండా వుంది." హృదయానికి హత్తుకుంటూ అన్నాడు.

సతి వంగి జయదేవ్ పాదాల్ని ముట్టుకుని

తన ఓటమిని అంగీకరించింది. "నిన్ను బాధ పెట్టడం నా అభిమతం కాదు జయదేవ్! నా ఈ దేహానికి కాంతి నశించిపోయింది. ఈ మాలిన్యకాయాన్ని నీ కర్పించలేనని చింత తప్పితే నా కింకేమీ బాధ లేదు" అనే అంతలో సతి కళ్ళల్లోకి మళ్ళీ నూతన అశ్రుకణాలు రెండు నిండుకొచ్చాయి. ఆ నిండు కంటిలో లయమందిన సతీదేవి పార్వతియై వెలసినట్లుగా కనిపించింది జయదేవుడికి.

అప్రయత్నంగా గాఢపరిష్వంగం జరిగింది. అది సామాన్యమానవమాత్రులికి కేవలం నీచమైన శారీరసంబంధంగానే అర్థమౌతుంది. గాని దాన్ని సరిగా అర్థం చేసుకోడానికి కళాకారులం కుమిలి- కవి తన కవిత్వంలోనూ చిత్రకారుడు తన చిత్రాల్లోనూ-గాయకుడు తన గానంలోనూ తప్ప ఇతరమయిన వాటికి అందనిది. వారు మాత్రమే ఆ శారీరకవిషయలోలత్వంతో సంబంధం లేని అలౌకిక ప్రేమను చూడగలరు.

కొండ మల్లెచెట్టు గాలికి గట్టిగా వూగి గాలి తెర నొకదానిని విసిరివేసింది. సతి కురులు ఎగిరి వచ్చి జయదేవుని కప్పివేశాయి. జయదేవ్ వివశుడై మత్తుగా "నువ్వు దక్షపుత్రి సతివి కాదు. అది గత జన్మ - నీవు పునీతం చేయబడ్డ పార్వతివి" అన్నాడు. రెక్కరాజు ఫక్కుననవ్వి సిగ్గులేకుండా అక్కడే నిలబడి వున్నాడింకా.

---

కథానిక

# శాంతిమతి

తా సీ రా

ఎంత విశాలమైన నగరమని కలకత్తా! వెడల్పాటి వీధులూ, ట్రాంబళ్ళూ, సుందరమైన పలువన్నెలతో వెలిగిపోయే కార్లూ, సైకిళ్లూ ఎత్తైన సౌధాలు, బాల్ డాన్సుల విలాస మందిరాలు, మద్యపాన గృహాలు! జీవంలేని, అచేతనమైన వస్తువులను చైతన్యవంతం చేసే సుందరమైన యువతులు, వింత వేషభాషల్లో మెలిగే యువకులతో, ఎనిమిది జాములూ, ఆనంద కోలాహలం మిన్నుముట్టుతూ వుంటుంది.

'కిదిర్‌పూర్' కలకత్తాలో ఒక పేట. ఆ పేటలో ఒక గల్లీలో ఒక గల్లీలో, డబల్ రోటి, బిస్కట్టులు అమ్ముకొనేవాని దుకాణంలో చాల సేపు అయింది. విశేషంగా ఏదో ఆనంద కోలాహలం రేగిపోతుంది. ఒక చిన్న గల్లీ దుకాణం. అంతగా కోలాహలం జరుగుతూంటానికి కారణం, ఒకవిధంగా ఆ దుకాణదారుని ఏకైకపుత్రిక 'శాంతిమతి' తరువాత ఆ దుకాణాన్ని ఆవరించివున్న ఆకర్షణీయమైన అలంకారం, స్వచ్ఛతాను. శాంతిమతి తరుణవయస్క. ఎంత అందమైనవారినైనా, తన వైపు ఆకర్షించుకొనేందుకు, ఆమె సౌందర్యం, చాలవరకు పనికి వస్తుంది.

సంధ్యా సమయమయ్యేసరికి, శాంతిమతి తనకు ప్రియమైన గౌను ధరించి, ఒదులాటి పైజమాను. పైన అందమైన ఒక వల్లెవాటూ వేసికొని మత్తెక్కించే తన బుల్లి పెదవులకు లిప్‌స్టిక్‌ను పల్చగా పూసుకొని, చక్కగా ముస్తాబై దుకాణం కౌంటర్ మీదకువచ్చి పడుతుంది. ఆమె రావటంతోనే అదేమిటో అక్కడ ఒక గుంపెడు మంది గుమికూడ్తారు. నాజూకైన చేతుల్తో ఆమె వస్తువు లందిస్తున్నప్పుడు యువకుల అతృప్తమైన ప్రేమదాహం, కోరుతున్న కళ్ళు రెండూ, శాంతిమతి సోయగంలో మునిగి తేలుతాయి. ఇక చివరకు పరవశంనుండి విడుదలై, నీరసంగా, వాళ్లు పాపం అక్కడినుంచి కదలిపోవాల్సి వస్తుంది కాసేపటికి ఏమంటే, వస్తువులు ఇచ్చివేసినపిదప, ఒక్కక్షణం సేపయినా మాటలు సాగించే అవకాశం ఇచ్చేదిగాదు. వెంటనే లోపలికిపోయేది.

శాంతిమతి ఏమంత పెద్దగా చదువుకోలేదు. కాలేజీ చదువుదాకగూడా రాలేదు. అయినా, స్వయంగా కృషిసల్పి, అధునాతనమైన నాగరికతకు సరిపోయే జ్ఞానాన్ని, నవలలు, పుస్తకాల ద్వారా పొందింది. ఆమె ఎవర్నీ ఇంతవరకు